TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 150 | ఆదివారం, జూన్ 21, 2026 | పేజీలు : 02 | వెల రూ. 1.00/-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# ఆత్మవిశ్వాసంతో.. పరీక్షకు హాజరు కండి

### ఎలాంటి ఒత్తిడికి గురికావదదందన్న సిఎం రేవంత్

### నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు

**హైదరాబాద్,జూన్20(నేటి ప్రభాతదర్శిని):**

నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.



# గత ప్రభుత్వాల సంకెళ్ల నుంచి బెంగాల్‌కు విముక్తి

### బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోడీ వ్యాఖ్య

**కోల్‌కతా,జూన్20(నేటి ప్రభాతదర్శిని):**

గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసి నప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్‌కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

### రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
### రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
### ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
### అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



**భువనేశ్వర్,జూన్20(నేటి ప్రభాతదర్శిని):**

ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేయాలి

### రోడ్లపై వర్షపు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి..
### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**నేటి ప్రభాతదర్శిని కరీంనగర్ జూన్ 20:**

రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు హాజరయ్యారు. రోడ్డు భద్రతా కమిటీ చైర్‌పర్సన్‌గా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి, అక్కడ స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వరద నీరు నిలిచే రహదారులపై ప్రత్యేక దృష్టి సారించి, నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి, దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రమాదకర మలుపులు, కల్వర్టులు, వంతెనల వద్ద ప్రతిబింబించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కల్వర్టులకు పసుపు రంగు వేయించి హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ నగరంలోని ప్రధాన రహదారులపై వీధి దీపాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెలుతురు లేని ప్రాంతాల్లో అదనపు లైటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరచడంతో పాటు ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరింత బలోపేతం చేయాలని చెప్పారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, మానవ తప్పిదాలు, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ వినియోగించకపోవడం వంటి కారణాల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో వర్షపు నీరు నిలిచే 16 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అలాగే పాఠశాలల పరిసరాల్లో జీబ్రా క్రాసింగ్‌లు, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ మాట్లాడుతూ, తీగలగుట్టపల్లి ఆర్‌ఓబీ వంతెన వద్ద రోడ్డు గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ టౌన్ ఏసిపి వెంకటస్వామి ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామి



**నేటి ప్రభాతదర్శిని పెద్దపల్లి జూన్ 20 :**

విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామిగా నిలిచినందుకుగాను శు క్రవారం రోజున హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కలెక్టరేట్ లో ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శాలువాతో సత్కరించారు.

# నర్సరీ, ఎల్.కే.జీ యూ కే.జీ.లలో ఒక సంవత్సరంపాటు పూర్తి ఉచితం విద్య

**జవహర్ నెహ్రూ విద్యాసంస్థల చైర్మన్ ఈశ్వరగారి నరహరి శర్మ**



**నేటి ప్రభాతదర్శిని వేములవాడ జూన్ 20 :**

ఎంతో మంది డాక్టర్లకు, ఇంజనీర్లకు ఆఫీసర్లకు విద్య నందించిన జవహర్ నెహ్రూ విద్యాసంస్థలు ప్రారంభించి 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 30వ తేదీ లోగా అడ్మిషన్ పొందగోరే చిన్నారులకు నర్సరీ, ఎల్.కే.జీ యూ కేజీలలో ఒక సంవత్సరం పాటు పూర్తి ఉచితం విద్యను అందించనున్నట్లు జవహర్ నెహ్రూ విద్యా సంస్థల చైర్మన్ ఈశ్వరగారి నరహరి శర్మ ఒక ఒక ప్రకటనలో తెలియ జేశారని మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు.

# నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జూన్ 21వ తేదీన నీట్ పరీక్ష నిర్వహణ**

**అభ్యర్థులు హాల్ టికెట్ లోని సూచనలను పక్కాగా పాటించాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**నేటి ప్రభాతదర్శిని జనగామ జూన్ 20 :**



జూన్ 21న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గాను జిల్లాలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో (396) మంది, పెంబర్తిలోని మహాత్మా జ్యోతి రావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో (192) మందితో కలిపి మొత్తం (588) మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. నీట్ పరీక్ష ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:15 వరకు ఉంటుందన్నారు. అలాగే రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం (50) మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య శిబిరం వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సీసీ కెమెరాల పనితీరు పట్ల జాగ్రత్తలు చేపట్టామన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టామని, బయో మెట్రిక్ విధానం, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించాకే పరీక్ష హాలుకు అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే చేరుకోవాలని, పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని సూచించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తుతో ప్రశ్న, జవాబు పత్రాలు నిర్దేశిత ప్రదేశాలకు చేరుతాయని స్పష్టం చేశారు.

# జిల్లాలోని ప్రతి చిన్నారికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**జూన్ 28న పల్స్ పోలియో బూత్ డే, 29-30 తేదీల్లో ఇంటింటి సందర్శనలను పకడ్బందీగా చేపట్టాలి**

**జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, జూలై 20న మాప్-అప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**అర్హులైన ఏ ఒక్క చిన్నారి కూడా కార్యక్రమాలకు దూరం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**



**నేటి ప్రభాతదర్శిని పెద్దపల్లి, జూన్-20**

జిల్లాలోని ప్రతి చిన్నారికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, పల్స్ పోలియో కార్యక్రమం, పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న వైద్య సేవల పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జూన్ 28, 2026న పల్స్ పోలియో బూత్ డే నిర్వహించి, జూన్ 29, 30 తేదీలలో ఇంటింటి సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 0 నుండి 5 సంవత్సరాల లోపు 62,902 మంది చిన్నారులకు పోలియో నిరోధక రెండు చుక్కల మందు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 8,38,373 జనాభా, 1,98,242 కుటుంబాలు ఉండగా, పోలియో కార్యక్రమం నిర్వహణ కోసం 381 పోలియో బూత్‌లు, 25 మొబైల్ బృందాలు, 24 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు వలస కూలీల పిల్లలు, పట్టణ మురికివాడల పిల్లలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలలో నివసించే కుటుంబాల పిల్లలు, గతంలో పోలియో చుక్కలు వేయించని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేసి తమ పరిధిలోని ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలియో కార్యక్రమం జరిగే రోజుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బృందాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు పోలియో చుక్కలు అందించాలని సూచించారు. సంక్షేమ, విద్యాశాఖలు పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై సమీక్షిస్తూ, జూలై 13, 2026న ప్రధాన కార్యక్రమం, జూలై 20న మాప్-అప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 2,27,251 మంది పిల్లలు, కిశోరులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలను నివారించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దీని ద్వారా పిల్లల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, చదువుపై ఏకాగ్రత మెరుగుపడతాయని తెలిపారు.1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు అర మాత్ర, 2 సంవత్సరాలు పైబడిన వారికి పూర్తి మాత్ర ఇవ్వాలని, 3 సంవత్సరాలు పైబడిన పిల్లలు మాత్రను నమిలి మింగేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులకు కూడా నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియో కార్యక్రమం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అర్హులైన ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమాలకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రులలో అవసరమైన మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, మరమ్మతులు లేదా పునరుద్ధరణ అవసరమైతే అంచనా వ్యయ ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన ప్లంబర్లు, అదనపు సిబ్బంది అవసరాలపై ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య సేవలు ప్రారంభించి, కంటి శస్త్రచికిత్సలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన డెంటల్ పరికరాలు, డెంటల్ చెయిర్లను త్వరితగతిన సమకూర్చాలని సూచించారు.వైద్యుల అందుబాటు పూర్తిస్థాయిలో ఉండాలని, వైద్యులు అందుబాటులో లేరనే పరిస్థితి వార్తలకు కారణం కాకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రులలో పారిశుధ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకోవాలని, రోగులకు అవసరమైన పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఓపీ సేవలు రద్దీ లేకుండా క్యూవిధానంలో క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.అదనపు అంబులెన్స్ సమకూర్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాబోయే రెండు నెలలకు అవసరమైన మందులు, సిరంజీలు, ఇతర వైద్య పరికరాల అవసరాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. శ్రీధర్, గోదావరిఖని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. హిమబిందు సింగ్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# టిటిడికి 20 లక్షల విరాళం

**హైదరాబాద్,జూన్20(నేటి ప్రభాతదర్శిని):**

తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టులకు భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్తలు వడ్లమూడి లలిత్‌కుమార్, యలమంచిలి కృష్ణారావు శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షల విరాళం ప్రకటించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి ఆ విరాళం డీడీలను అందజేశారు. మహాయజ్ఞంలా నిత్యం లక్షలాది మంది భక్తులకు అన్న ప్రసాదాల వితరణకు సహకారం అందించిన దాతలను ఆయన అభినందించారు.

# స్కూల్ టాపర్లకు నగదు ప్రోత్సాహకం

**పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పంపిణీ**

**నెల్లూరు,జూన్20(నేటి ప్రభాతదర్శిని) :**

కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం నెల్లూరు పట్టాభిరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పాఠశాల విద్యార్థిని బీ జాహ్నవి 587 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినందుకు రూ.50 వేలు, అలాగే 95 శాతం కంటే అధిక మార్కులు సాధించినందుకు మరో రూ.50 వేలు కలిపి మొత్తం రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని బహుకరించారు. మరో విద్యార్థి టీఎన్ మేఘశ్యామ్ 562 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానంలో నిలవగా రూ.20 వేలు, ఎస్కే షబ్రీన్ 560 మార్కులతో పాఠశాల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినందుకు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. వీటితో పాటు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు నందిని, ధరణి, సునయన, సుజిత, షామీర్, సల్మా, వెంకటేశ్వర్లకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ నగదు ప్రోత్సాహకాలను ఎంఈఓలు వసంతకుమారి, ఎన్ అంకయ్యల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ మోహనరామలింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ 3,909 కేసుల పరిష్కారం

**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల జూన్ 20 :**



జాతీయ లోక్ అదాలత్ 3,909 కేసుల పరిష్కారం ను పరిష్కరించడం జరిగిందని అందుకు గాను రూ.2,27,71, 225/- లను నష్ట పరిహారం మరియు జరిమానాల రూపంలో చెల్లించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి.నీరజ తెలిపారు. మోటార్ వాహన ప్రమాద కేసులు:15 సివిల్ తగాదాలు : 10 కిమినల్ కేసులు: 246సైబర్ క్రైమ్ కేసులు: 61 ఎక్సైజ్ కేసులు: 09 చెక్ బౌన్స్ కేసులు : 04 కుటుంబ తగాదాలు : 08 బ్యాంకు కేసులు : 8 దీూచీూ: 23 డ్రంక్ అండ్ డ్రైవ్ : 1028 ట్రాఫిక్ చలాన్ కేసులు: 2419 ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీమతి.బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, అదనపు ఎస్పీ శ్రీ. డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల - కమ్ - ఖీూజ: కార్యదర్శి, ఖూూ శ్రీ.పి.లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ.ఆవునూరి రమాకాంతరావు, లోక్ అదాలత్ సభ్యులు శ్రీ.చింతోజు భాస్కర్ ఇతర న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు మరియు కక్షిదారులు పాల్గొన్నారు.

